క్లుప్తంగా

6న కుంభాభిషేక మహోత్సవం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని శ్రీ కనక దుర్గ ఆలయం మహోత్సవం సందర్భంగా ఈ నెల 6 నుంచి 8 వరకు కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలను మోసం చేసిందని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ రమేష్, మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్ నాయక్‌లు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయలేదని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాసాని అయిలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సుజాతనగర్: మండలంలో ఆయా కారణాలతో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన దివంగత సీపీఎం సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. కోమటిపల్లికి చెందిన భూక్యా చందర్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతలపూడి రాజశేఖర్, నాయకులు బానోత్ కోటేష్, తులసీరాం, పైడిపల్లి మహేష్, కందుకూరి రాము, పులి సత్యనారాయణ, శివ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

పాల్వంచరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి మొండి చేయి చూపి తీవ్ర అన్యాయం చేసిందని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ. సామాన్య ప్రజలకు నేరుగా లబ్ది చేకూరే ఎలాంటి పథకాలు లేవన్నారు. రాష్ట్ర ప్రజలపై కేంద్రం చూపిన వివక్షతో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని బీజేపీకి తగిన బుద్ధి చెప్తారన్నారు.

కొత్తూరు శనగ చెరువు ఆయకట్టు కింద వరి నాట్లు వేస్తున్న కూలీలు



ముమ్మరంగా యాసంగి..

గణనీయంగా పెరిగిన వరి విస్తీర్ణం

- నన్నరకానికి బోనస్ కల్పించడంతో ఆసక్తి

జూలూరుపాడు: మండలంలో యాసంగిలో వరి సాగు ముమ్మరంగా సాగుతోంది. గతేడాది కంటే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా పెరగనుంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం (సన్న రకానికి) క్వింటాకు రూ.500లు బోనస్ కల్పించడంతో రైతులు యాసంగిలో కూడా వరి సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాదిలో సుమారు 1,100 ఎకరాల్లోనే సాగు కాగా, ఈ ఏడాది సుమారు 1,500 ఎకరాల్లో సాగయ్యే పరిస్థితి కన్పిస్తోంది. ఇప్పటికే 700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగు చేశారు. ఖరీఫ్ సీజనలో వరి దిగుబడి గణనీయంగా పెరగడంతో ఈ యాసంగిలో అత్యధిక విస్తీర్ణంలో వరి సన్న రకం సాగు చేస్తున్నారు. రైతులు వరి పంట దిగుబడి 30–35 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతోపాటు, రూ.500లు బోనస్ లభిస్తుండటంతో అధిక విస్తీర్ణంలో సన్నాలు సాగు చేస్తుండగా అక్కడక్కడ మొద్దు రకం సాగు చేస్తున్నారు.

సాగులో నిమగ్నం..



నీటి వసతి ఉన్న చెరువుల ఆయకట్టు, చెక్‌డ్యాంలు, వాగులు, వ్యవసాయ బోర్ల కింద ఉన్న భూముల్లో రైతులు వరి పంట సాగులో నిమగ్నమయ్యారు. రైతులు పొలాలను దుక్కి దున్ని, దమ్ము చేసి పెరిగిన వరినారును కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. అదేవిధంగా కూలీల కొరత, పెట్టుబడి తగ్గడం, తక్కువ కాల వ్యవధిలో పంట చేతికి వస్తుందని కొందరు రైతులు మూడు రోజులు నానబెట్టిన వరి విత్తనాలను నేరుగా పొలంలో చల్లుతున్నారు. ఇలా వరి సాగు చేయడం వల్ల ఎకరానికి పెట్టుబడి రూ.10 వేలు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో పంట దిగుబడి వచ్చినట్లే యాసంగిలో కలిసి రాకపోతుందా అనే ఆశతో వరిని సాగు చేస్తున్నారు.

11 ఎకరాల్లో సాగు చేశాం..



యాసంగిలో వరి దిగుబడి వస్తుందని సాగు చేస్తున్నాం. 11 ఎకరాల్లో వరి సాగు చేశాం. ఇందులో కౌలుకు తీసుకున్న ఆరెకరాల్లో మొద్దులు, ఐదెకరాల సొంత పొలంలో సన్నాలు సాగు చేశాను. ఖరీఫ్‌లో 12 ఎకరాల్లో వరి సాగు చేస్తే ఎకరానికి 38–40 బస్తాలు వరి ధాన్యం దిగుబడి వచ్చింది.

– కిలారి నాగరాజు, రైతు, జదలచింత

సన్నాలు సాగు చేస్తున్నా..



ఒక ఎకరం వరి సాగు చేస్తున్నాం. ట్రాక్టర్‌తో దుక్కి దున్ని, దమ్ము చేసిన తరువాత కూలీలతో వరి నారు నాటు వేయించడం జరిగింది. ఖరీఫ్‌లో ఎకరానికి 30 బస్తాల దిగుబడి రాగా, యాసంగిలో కూడా మంచి దిగుబడి వస్తుందని సన్న రకం (సాంబ) సాగు చేస్తున్నాం.

– బానోత్ లోక్యా, అన్నారుపాడు

సాగు పెరిగే అవకాశం..



గత యాసంగిలో వెయ్యి ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వరి సాగయ్యింది. అయితే ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. యాసంగిలో మినుము, పెసర, సజ్జ, జొన్న, ప్రొద్దు తిరుగుడు, వేరుశనగ, కూరగాయల సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది.

– దీపక్ ఆనంద్, ఏఓ, జూలూరుపాడు

కష్టంగా కాకుండా ఇష్టపడి చదవాలి



పుస్తకాలు అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు ఏ అంశంలోనైనా కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని సింగరేణి మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రాజీవ్‌కుమార్, కోట శివశంకర్, కేర్ డెవలప్‌మెంట్ ఏసీడీఓ సునీత పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన వినయ్‌కుమార్



కేసీఆర్‌తో వినయ్‌కుమార్

టేకులపల్లి: మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన కేసీఆర్ అభిమాని చింతమళ్ల వినయ్ కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం హైదరాబాద్ ఎర్రవల్లి ఫాం హౌజ్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. తన సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పట్ల తప్పుడు ప్రచారాలను, విమర్శలను ఖండిస్తూ ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేసీఆర్ తెలిపారన్నారు.

నేడు ధర్నా

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి పైసా కేటాయింపులేకపోవటాన్ని నిరసిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఇల్లెందులో జరుగు ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులుడు దొడ్డా డానియేల్, పులి సైదులు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఇల్లెందు జేకే ఏరియాలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహించి వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు.

'మళ్లీ జన్మ ఉంటే సింగరేణిలోనే ఉద్యోగం చేస్తా'



జీఎం శ్రీనివాసరావును సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ తల్లిలా లాలించిందని, మళ్లీ జన్మ ఉంటే సింగరేణి సంస్థలోనే ఉద్యోగం చేస్తానని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కోడూరు శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి కొత్తగూడెంలోని ఒక క్లబ్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో 34 ఏళ్ల వివిధ ఏరియాల్లో వివిధ హోదాల్లో పనిచేసి, పదవీ విరమణ పొందిన శ్రీనివాస్‌ను తోటి అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సంస్థలో 1991లో వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరి, ఎందరో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ, సంస్థ అభివృద్ధిలో భాగంగా జీఎం స్థాయికి ఎదిగి పదవీ విరమణ పొందటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం పర్సనల్ కవితానాయుడు, మాజీ జీఎం పర్సనల్ కట్టా బసవయ్య, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, ఏఈపీఏటీబీ సెల్, ఐటీ విభాగం, ఆర్సీ, ఐఆర్‌పీఎం, ఈఈ సెల్, ఈఆర్సీ, కమ్యూనికేషన్, స్పోర్ట్స్, సీపీఆర్ఎంఎస్ విభాగాల డీజీఎంలు, పర్సనల్ మేనేజర్లు, డీవైపీఎంలు, పీవోలు, అధికారులు, నాయకులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోనం ఎత్తిన మహిళలు



బోనాలతో మహిళలు

ఇల్లెందు: స్థానిక గిరిజన సహకార సంస్థ(జీసీసీ) కార్యాలయంలో నిర్మించిన గుడిలో మైసమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా ఆదివారం మహిళలు బోనాలు ఎత్తారు. కార్యాలయంలో మేనేజర్ నర్సింహారావు, హమాలీలు కలిసి కట్టుగా ఆలయాన్ని నిర్మించి అందులో విగ్రహాలను ప్రతిష్ఠించారు. దీంతో ప్రత్యేక పూజలు, హోమాలతో సందడిగా మారింది. పచ్చని తోరణాలు, ప్రత్యేక పూజలతో జీసీసీ ఆవరణ పండుగ వాతావరణం అలుముకుంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఊరువాడా ఏకంగా ఒక చోట చేరి ఆనందంగా విందు ఆరగించారు. జీసీసీ మేనేజర్ నర్సింహారావు సతీసమేతంగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజంతా జీసీసీ ఆవరణలో పండుగ సందడితో అలరించింది.

సేవలు చిరకాలం నిలిచిపోతాయి



రుక్మాంగధర్ బండారిని సన్మానిస్తున్న ప్రజలు

కొత్తగూడెంఅర్బన్: ప్రజలకు చేసిన సేవలు చిరకాలం నిలిచిపోతాయని మాజీ కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి అన్నారు. ఆదివారం వార్డు ప్రజలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రుక్మాంగధర్ బండారి మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం మరి యువత కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, గణేష్, రజనీకాంత్ బండారి, కాళీ, జానీ, తమ్మిశెట్టి విజయ్, తిరుపతి, నరసింహ, మెడిదా రవికుమార్, మోహన్, మనోజ్, ప్రకాష్ పండిట్, మణికంఠ డింపుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

5న ఎస్‌కేఎం ఆధ్వర్యంలో నిరసన

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 5న ఎస్‌కేఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినున్నామని కిసాన్ మోర్చ ప్లాట్ ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... దేశ వ్యాప్త రైతుకూలిలు, కార్మికులు బీజేపీ అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని దీనికి నిరసనగా నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

జూలూరుపాడు: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర బడ్జెట్ బీహార్ బడ్జెట్‌గా మారిందని, రాష్ట్రం నుంచి కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు 16 మంది ఉన్నా సాధించింది శూన్యమని తెలిపారు. తెలంగాణపై కేంద్రం ప్రభుత్వం వివక్ష చూపుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణ అమలుకు ఈనెల 7న జరిగే చలోహైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు చెంగల గురునాథం, మండలాధ్యక్షుడు దిబ్బెందుల సాయి కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. లక్ష డప్పుల, వేల గొంతుకల సాంస్కృతిక ప్రదర్శనకు జూలూరుపాడుకు చెందిన హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మోదుగు దేవదాస్ 10 డప్పులను వితరణ చేశారన్నారు. నాయకులు రాంబాబు, చెంగల నరసింహారావు, శివ, బద్రి, వినన్నపల్లి నాగరాజు, సముద్రాల పవన్‌కుమార్, నేలాల ప్రదీప్, నిఖిల్, రంజిత్, వికాస్, వెంకట నాగరాజు పాల్గొన్నారు.

కాలయాపనకే పరిమితమైన ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న భావ్‌సింగ్

ఇల్లెందురూరల్: పేదలకు నిలువ నీడ సౌకర్యం కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మంజూరు చేయకుండా సర్వే, రీసర్వే పేరుతో కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు అజ్మీర భావ్‌సింగ్ అన్నారు. మండలంలోని రొంపేడు గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు కాంగ్రెస్ నాయకులతో ఇందిరమ్మ కమిటీలు వేశారని గర్తుచేశారు. కమిటీ సభ్యుల పర్యవేక్షణలోనే పంచాయతీ కార్యదర్శులతో సర్వే నిర్వహించి అర్హుల జాబితాను కూడా గ్రామసభల్లో ప్రకటించారన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరుగ్యారంటీల్లో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు గుగులోత్ సోమన్న, రాంజీ, జర్పుల మోతీలాల్, భద్రమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో హాజరైన పూర్వ విద్యార్థులు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008–09 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 15 ఏళ్ల తరువాత పాఠశాలలో చిన్ననాటి తీపి గుర్తులను మననం చేసుకుంటూ సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులకు జ్ఞాపికలను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. చాలా కాలం తరువాత స్నేహితులను కలవడం ఆనందంగా ఉందని, ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను తరచూ నిర్వహించుకునేలా ప్రణాళిక రూపొందించుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గురువులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తలుపులు తెరిచి ఉంటే అంతే..

పల్లెల్లో బీభత్సం సృష్టిస్తున్న కోతులు

- ఇళ్లలోకి చొరబడి దాడులు
- పట్టించుకోని అధికారులు



సుజాతనగర్‌లో గుంపులుగా తిరుగుతున్న కోతులు

సుజాతనగర్: వానరాలు గ్రామాల్లో కిష్కింధకాండను సృష్టిస్తున్నాయి. పల్లెల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు వాటి చేష్టలతో నష్టపోతున్నారు. పదుల సంఖ్యలో ఒక్కసారిగా ఇళ్లు, షాపుల మీద పడి దాడి చేస్తు పైకప్పులు, పెంకులు, రేకులు తొలగిస్తున్నాయి. ఇళ్లలో తయారుచేసుకున్న భోజనంతో పాటు, పప్పు దినుసులు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు. షాపుల్లో బలవంతంగా చొరబడుతూ తినే పదార్థాలను లాక్కెళ్తున్నాయి. అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే ఎదురుదాడికి యత్నిస్తుండటంతో తమకు కోతుల నుంచి రక్షణ కరువైందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తలుపులు, కిటికీలు తెరిచి ఉంటే ఇక అంతే సంగతి. ఇళ్లలోకి చొరబడి చేతికి ఏది దొరికితే అది ఎత్తుకెళ్లి ధ్వంసం చేస్తున్నాయి. వానరాల దెబ్బకు ఆయా గ్రామాల్లో కూరగాయలు, పండ్ల చెట్లు, మొక్కలు పెంచుకునే పరిస్థితి లేదు. నిత్యం కోతులకు కాపలా కాయలేక పోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి బాధ భరించలేక చాలా మంది తమ షాపుల ఎదుట, ఇళ్ల కారిడర్ ఏరియాలో జాలీలను బిగించుకున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో చెప్పవచ్చు. వీటి కారణంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. కోతుల బాధలు భరించలేక సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న వారే లేరని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కోతి కాటుకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. కోతుల బెడద తీవ్రం కావడంతో కొందరు టపాసులు, పెద్ద శబ్దాలు చేసి వాటిని తరిమి వేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోతులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

నరకం అనుభవిస్తున్నాం..



వానరాల గుంపు వచ్చిందంటే మాకు నరకమే..గుంపులు గుంపులుగా కోతులు వస్తూ వాడలోని అందరిని భయపెడుతున్నాయి ఇళ్ల మీద దూకుతూ నానా భీభత్సాన్ని సృష్టిస్తున్నాయి.

– కోపెల తిరుపతయ్య, సుజాతనగర్

కోతులను నియంత్రించాలి



మండలం అంతటా కోతులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కోతులు ఇండ్లలోకి వచ్చి అన్ని ఎత్తుకు పోతున్నాయి. అడ్డుంటే బెదిరిస్తూ దాడికి ప్రయత్నిస్తు న్నాయి. కోతుల బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మామిడాల సాంబశివరావు, గొల్లగూడెం

అటవీ అధికారులతో మాట్లాడతాం.



కోతులతో ఇబ్బంది పడుతున్నామని పలువురు ఫోన్‌లో సమస్యను చెబుతున్నారు. అటవీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం.

– బానోత్ భారతి, ఎంపీడీఓ, సుజాతనగర్

పొలాల్లోనూ కిష్కింధకాండ..



పంటలను ధ్వంసం చేస్తున్న వానరాలు

ఇల్లెందురూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో చేలను రక్షించుకోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. మైదాన ప్రాంతాలకే పరిమితమైన వానరాలు క్రమంగా ఏజెన్సీ గ్రామాలకు వ్యాపించి పంట చేలను ధ్వంసం చేస్తున్నాయి. మండలంలోని ఇల్లెందు–కొమరారం మార్గంలో యాసంగిలో వేసిన మొక్కజొన్న చేలు మొలక దశలో ఉండగానే కోతులు పీకేస్తున్నాయి. కోతుల నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు చేల వద్దే మంచెలను ఏర్పాటు చేసుకోవడం, కుక్కలను రక్షణగా చేల వద్దే ఉంచడం, కర్రలకు సీసాలు కట్టి గాలి వచ్చిన పుపడెల్లా శబ్దాలు చేసేలా వంటి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నా వానరాల తాకిడిని అరికట్టలేక పోతున్నారు. చేలలోకి వందల సంఖ్యలో వస్తున్న వానరాల నుంచి పంటలను రక్షించుకోవడం ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. విత్తనం వేసిన సమయం నుంచి పంట చేతికందే వరకు చేను వద్దే ఇంటికొకరు చొప్పున కాపలా ఉండాల్సి వస్తోందని, ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా కోతుల గుంపు పంటలపై దాడి చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులను నియంత్రించాలని వేడుకుంటున్నారు.